సాక్షి

విశాఖపట్నం

శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జిల్లాలో ఉత్సాహంగా సాగుతున్నాయి. 8లో



చిన్నారి పెళ్లికూతురు సందడి 8లో

మార్గశిర శోభ



శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మార్గశిర మాసం మూడో గురువారం అమ్మవారి దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. 8లో

న్యూస్‌రీల్

స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ రికార్డు ఉత్పత్తి



స్టీల్‌ప్లాంట్‌లోని స్ట్రక్చరల్ మిల్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ విభాగం (ఎస్టీఎం) వివిధ ఉత్పత్తుల తయారీలో పలు రికార్డులను అధిగమిస్తుంది. గతంలో యాంగిల్, 50 ఎంఎం రౌండ్, 63 ఎంఎం రౌండ్ ఉత్పత్తుల్లో రికార్డులు సాధించగా డిసెంబర్ 27న 'బి' షిఫ్ట్‌లో 56 ఎంఎం రౌండ్ ఉత్పత్తిలో రికార్డు సాధించింది. విభాగంలో తయారయ్యే పలు ఉత్పత్తుల్లో ఒకటైన 56 ఎంఎం రౌండ్ ఆ రోజు అత్యధికంగా 1,239 టన్నులు ఉత్పత్తి సాధించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 8న 'సి' షిఫ్ట్‌లో 56 ఎం.ఎం రౌండ్ అత్యధికంగా 1,159 టన్నులు ఉత్పత్తి జరిగింది. రికార్డు ఉత్పత్తి సాధించిన ఎస్టీఎం విభాగం ఉద్యోగులను విభాగం ఉన్నతాధికారులు అభినందించారు.

గాజువాకలో రికార్డు స్థాయిలో ఆస్తిపన్ను వసూలు



జెడ్సీ సింహాచలంకు చెక్కులను అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్ రెవెన్యూ అధికారులు రికార్డు స్థాయిలో ఆస్తిపన్ను వసూలు చేశారు. గురువారం ఒక్కరోజే రూ.3,62,77,937లను వసూలు చేసి ఉన్నతాధికారుల అభినందలను అందుకున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి రూ.3,41,47,156, రామచంద్ర హోటల్స్ నుంచి రూ.7,40,000, మూర్తి బిల్డర్స్ నుంచి రూ.3,69,000, ఎస్.సత్యనారాయణ మూర్తి అనే వ్యక్తి నుంచి రూ.4,43,000 వసూలు చేశారు. ఈ పన్నులకు సంబంధించిన చెక్కులను రెవెన్యూ అధికారులు సీహెచ్.రామనారాయణ, ఎం.శ్రీకాంత్ తమ ఆర్ఐలు కె.శివ, రెడ్డి మోహన్‌లతో కలిసి జోనల్ కమిషనర్ పి.సింహాచలంకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని జెడ్సీ అభినందించారు. పన్నులను పూర్తిస్థాయిలో వసూలు చేయాలని సూచించారు.

'సంజీవని నిధి'కి విరాళాలివ్వండి

కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

మహారాణిపేట: అభాగ్యులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన సంజీవని నిధి–డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్ సొసైటీకి విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఏడాది జిల్లాలో సంజీవని నిధికి విశేష స్పందన లభించిందని, 2024లో కూడా ఉద్యోగులు, పీఎస్‌యూలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, వివిధ అసోసియేషన్లు సహకారం అందించాలని కోరారు. చెక్కులు, డిపాజిట్ల ద్వారా విరాళాలు అందజేయవచ్చని చెప్పారు. 2023లో రూ.17 లక్షల మేర సంజీవని నిధికి విరాళాలు వచ్చాయని, ఇందులో రూ.1.34 లక్షలను హెల్త్ స్కీమ్‌లో చేరిన 512 మంది దివ్యాంగ పిల్లలకు ప్రీమియం చెల్లించామని, ఏడుగురు లబ్ధిదారుల కోసం రూ.1.30 లక్షలను ఉపయోగించామని తెలిపారు. సంజీవని నిధి–డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు విరాళాలు అందించే వారు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(జిల్లా పరిషత్ బ్రాంచ్) ఎకౌంట్ నంబర్ 50100500766040లో జమ చేయాలని కలెక్టర్ మల్లికార్జున కోరారు.

అప్పన్నను దర్శించుకున్న చెన్నై హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ కార్తికేయన్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.కార్తికేయన్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ వెంకటరమణ అందజేశారు.

అందరికీ ఆరోగ్య భాగ్యం

- **జనవరి 2 నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష**
- వారానికి రెండు చోట్ల సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు
- అవసరమైన వారిని నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు
- ప్రతీ రోగికి ఉచితంగా పరీక్షలు, వైద్యం, మందులు



మహారాణిపేట: ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి అనారోగ్య సమస్యలున్న వారిని గుర్తించి అవసరమైన వైద్య సాయం అందించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లాలో సూపర్ సక్సెస్ అయింది. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 7వ తేదీ వరకు సాగిన ఈ కార్యక్రమంలో మొత్తం 468 వైద్య శిబిరాలు నిర్వహించారు. 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను అందుబాటులో ఉంచారు. స్పెషలిస్ట్ వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, ఇతర ఆరోగ్య సిబ్బంది 2,02,655 మందికి ఓపీ సేవలందించారు. మొత్తం 2,560 మందిని వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా పలు నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ఇదే తరహాలో వచ్చే ఏడాది జనవరి 2 నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది.

మొదటి విడత విజయవంతం

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా జిల్లాలో అర్బన్‌లో 468 మంది, రూరల్‌లో 54 కలిపి మొత్తం 468 వైద్య శిబిరాలు నిర్వహించారు. మొత్తం 2,02,655 మందికి ఓపీ సేవలందించారు. మొత్తం 2,560 మందిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పలు నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ఇందులో 1,732 మంది వివిధ కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేరారు. **వీరిలో 84 మందికి శస్త్రచికిత్సలు పూర్తి చేశారు. అర్బన్, రూరల్‌లో మొత్తం 23,448 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 9,953 మందికి** కళ్లద్దాలు పంపిణీ చేశారు. కంటి సమస్యలున్న వారికి మందులు అందజేశారు. 1,749 మందిని కేటరాక్ట్ శస్త్రచికిత్సలకు గుర్తించగా.. ఇందులో 436 మందికి శస్త్రచికిత్సలు చేశారు. మరో 467 మంది కేటరాక్ట్ శస్త్రచికిత్స కోసం సిద్ధంగా ఉన్నారు. టి.బి. అనుమానిత లక్షణాలతో 7,095 మంది, లెప్రసీతో 359 మంది, రక్తహీనతతో 3,877 మందిని గుర్తించి చికిత్స అందించారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా మొత్తం 601 వైద్య శిబిరాలు నిర్వహించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది. సచివాలయాల పరిధిలో వారానికి రెండు చోట్ల నిర్వహించే శిబిరాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యులు పాల్గొంటారు.



ఆరోగ్య సురక్ష కార్డులు అందజేస్తున్న మంత్రి(ఫైల్)

విస్తృతంగా ఏర్పాట్లు



జిల్లాలో మొదటి విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేశాం. అదే స్ఫూర్తితో రెండో విడత నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. జనవరి 2వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనే సిబ్బందికి పలు సూచనలు చేశాం. వారికి మ్యాపింగ్ చేస్తున్నాం. గత అనుభవాలతో ఎక్కడా సమన్వయలోపం లేకుండా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తాం. జూన్ 30 వరకు శిబిరాలు కొనసాగుతాయి.

– **డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎంహెచ్‌వో**

601 శిబిరాల నిర్వహణ



ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా జిల్లాలో మొత్తం 601 శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. అందుకు అవసరమైన వైద్యులను నియమిస్తున్నాం. ప్రతీ వైద్య శిబిరంలో నలుగురు వైద్యులు పాల్గొంటారు. ఇందులో ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులు, మరో ఇద్దరు స్పెషలిస్టులు ఉంటారు. గైనిక్, పిల్లల వైద్యులు కచ్చితంగా పాల్గొనేలా చర్యలు తీసుకుంటాం. అవసరమైన వారికి పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందిస్తాం. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని ఆరోగ్య శ్రీ ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేస్తాం.

– **డాక్టర్ బి.ఉమావతి, ప్రాజెక్ట్ నోడల్ అధికారి**

యువతకు ఉద్యోగ కల్పనే సీఎం జగన్ లక్ష్యం



జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

- త్వరలో అన్ని నియోజకవర్గాల్లో జాబ్‌మేళాలు
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

తగరపువలస: రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. చెరకుపల్లి అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరగనున్న మెగా జాబ్‌మేళాను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 26 స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను నెలకొల్పి 175 నియోజకవర్గాల్లో పరిశ్రమలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇస్తున్నారన్నారు. తద్వారా వీరికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న జాబ్‌మేళా ద్వారా 32 కంపెనీలకు చెందిన ఐటీ, సోలార్, ఫార్మసీ, కార్పొరేట్, బీమా తదితర సంస్థల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులకు అవకాశాలు కల్పించనున్నారన్నారు. రానున్న రెండు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా అన్ని నియోజకవర్గాలలో జాబ్‌మేళాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో విశాఖ బెస్ట్‌గా నిలుస్తుందన్నారు. దేశంలో జ్యూట్, పంచదార పరిశ్రమలు మూతపడటానికి తయారీ ఖర్చులు పెరగడం, ప్రత్యామ్నాయ వస్తువుల పోటీయే కారణమన్నారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ జాబ్‌మేళా ద్వారా 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు, వైద్య తదితర రంగాల్లో 6 లక్షల ఉద్యోగాలు కల్పించారన్నారు. చంద్రబాబు హయాంలో ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేదన్నారు. విశాఖ రాజధాని అయితే బెంగళూర్, చెన్నైలకు దీటుగా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు.

భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ రంగాలలో అవకాశాలు అందిపుచ్చుకోవడానికి ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా నాణ్యమైన మానవ వనరులు అందిస్తుందన్నారు. ఐఆర్ఎస్ఎంఈ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాల శ్రీనివాస్ మాట్లాడుతూ లిఖిత, మౌఖిక, బృంద చర్చల ద్వారా అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి టెక్నికల్, సాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్‌తోపాటు జనరల్ నాలెడ్జ్‌పై దృష్టి సారించాలన్నారు. టెక్ మహీంద్ర, అరబిందో, డాక్టర్ రెడ్డీస్, మిరాకిల్, కోగెంట్, హ్యుందాయ్, సినర్జీస్ తదతర సంస్థలు ఈ జాబ్‌మేళాలో అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి కె.సాయికృష్ణ చైతన్య, ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ప్లేస్‌మెంట్ అధికారులు శ్రీనివాసరావు, రూప్ సుందర్, రీసెర్చ్ ప్రిన్సిపాల్ గోవిందరావు, డైరెక్టర్ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూయర్ ఈవెంట్లకు అనుమతులు తప్పనిసరి

నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

విశాఖ సిటీ: నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించే వేడుకలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ స్పష్టం చేశారు. నగరంలో ఉన్న హోటళ్లు, క్లబ్‌లు, పబ్‌ల నిర్వాహకులు వేడుకల నిర్వహణకు మార్గదర్శకాలు జారీ చేశారు.

- న్యూయర్ రోజు అర్ధరాత్రి ఒంటి గంట వరకు ఈవెంట్‌లు/కార్యక్రమాలు నిర్వహించే వారు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలి.
- ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం –2013 ప్రకారం నిర్వాహకులు హోటల్, క్లబ్, పబ్ బయటకు/లోపలికి వచ్చే మార్గాలలో, పార్కింగ్ ప్రాంతాల్లో తప్పకుండా సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- వేడుకలు, కార్యక్రమాల వద్ద ట్రాఫిక్, భద్రత కోసం తగిన సంఖ్యలో సిబ్బందిని నిర్వాహకులే నియమించుకోవాలి.
- వేడుకల్లో దుస్తులు, నృత్యాలు, మాట్లాడే విధానాల్లో ఎటువంటి అశ్లీలత ఉండకూడదు.
- నిర్వాహకులు డీజే/స్పీకర్స్ శబ్దం 45 డెసిబెల్స్‌ను మించకూడదు.
- కార్యక్రమ వేదిక వద్ద ఎటువంటి బాణసంచా, పేలుడు పదార్థాలను నిర్వాహకులు అనుమతించకూడదు. సదరు విషయాన్ని కస్టమర్లకు ముందుగా తెలియజేయాలి.
- సామర్థ్యానికి మించి పాస్‌లు, టికెట్లు, కూపన్‌లు మంజూరు చేయకూడదు. ఇది శాంతిభద్రతల సమస్యకు దారితీయవచ్చు.
- ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా నిర్వాహకులు వేదికల వద్ద ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలి.
- పబ్‌లు, బార్లలో ప్రత్యేకంగా దంపతులు, జంటల కోసం నిర్వహించే కార్యక్రమాల్లో మైనర్లను అనుమతించకూడదు.
- ఎవరూ డ్రగ్స్ లేదా నార్కోటిక్స్, సైకోట్రోపిక్ పదార్థాలను ఉపయోగించకూడదని నిర్వాహకులు ఖచ్చితంగా హెచ్చరించాలి. మేనేజ్‌మెంట్‌లు వాటిని నిరోధించడంలో విఫలమైతే అది నిర్వహణ లోపంగా భావించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు. డ్రగ్స్ రహస్యంగా విక్రయించే పార్కింగ్ ప్రాంతాలు, ఇతర ప్రదేశాలపై నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
- ఎక్సైజ్ శాఖ అధికారులు అనుమతించిన సమయం వరకూ మాత్రమే మద్యాన్ని అందించాలి.
- మద్యం సేవించిన వారు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి డ్రైవర్లు/క్యాబ్‌లు ఏర్పాటు చేసే బాధ్యత పబ్‌లు/బార్‌ల నిర్వాహకులదే.
- బాణసంచా కాల్చకూడదు. జిల్లా అగ్నిమాపక అధికారి, ప్రాంతీయ అగ్నిమాపక అధికారి సూచనలను తప్పనిసరిగా పాటించాలి.
- ఏదైనా నష్టం వాటిల్లినా, ఇబ్బందులు ఏర్పడినా పూర్తి బాధ్యత అనుమతి దరఖాస్తుదారునిపై ఉంటుంది.
- విదేశీయులు ఎవరైనా ఈవెంట్‌కు హాజరైతే పోలీసులకు సమాచారం అందించాలి.

నోటీస్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలి

- నిర్వాహకులు విధిగా కొన్ని సూచనలు, సలహాలతో కార్యక్రమాలు నిర్వహించే ప్రాంగణాల ప్రవేశ ద్వారాల వద్ద, లోపల అందరికీ కనిపించే విధంగా నోటీస్ బోర్డులు ఏర్పాటు చేయాలి.
- మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం నేరం.
- వాహనదారులకు 30 ఎంజీ/100 ఎంఎల్‌కు మించి బ్రీత్ అనలైజర్‌లో రీడింగ్ చూపిస్తే కేసు నమోదు చేస్తారు. అటువంటి సందర్భంలో డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న మద్యం తాగని వారు ఉంటే వారికి వాహనం ఇస్తారు. లేకుంటే తాత్కాలిక కస్టడీ కోసం వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలిస్తారు.
- డ్రంక్ అండ్ డ్రైవింగ్ జరిమానాగా రూ.10 వేలు లేదా 6 నెలల జైలు శిక్ష పడుతుంది. డ్రైవింగ్ లైసెన్స్ 3 నెలలు, అంతకంటే ఎక్కువ కాలం లేదా శాశ్వతంగా నిలిపివేయబడుతుంది.
- మైనర్లు వాహనం నడపకూడదు, నడిపితే యజమానులే బాధ్యత వహించాలి.
- ద్విచక్ర వాహనాల సైలెన్సర్‌లను తొలగించకూడదు. శబ్ద కాలుష్యాన్ని నివారించాలి.
- వాహనదారులు ఓవర్ స్పీడ్‌లో నడపడం, ప్రమాదకరమైన డ్రైవింగ్, బహిరంగ ప్రదేశాల్లో రేసింగ్ చేసిన వారు సెక్షన్ 183, 184 ప్రకారం శిక్షార్హులవుతారు.

జీవీఎంసీ బడ్జెట్‌కు స్థాయీ సంఘం ఆమోదం



మాట్లాడుతున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 2024–25 వార్షిక ఏడాది బడ్జెట్‌ను స్థాయీ సంఘం సభ్యులు చర్చించి ఆమోదించారని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో బడ్జెట్‌పై గురువారం స్థాయీ సంఘ సభ్యులు, అధికారులతో ఆమె చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీవీఎంసీ 2024–25 ఆర్థిక సంవత్సరానికి గానూ సవరించిన అంచనా బడ్జెట్‌ను అధికారులు స్థాయీ సంఘంలో ప్రవేశపెట్టినట్లు చెప్పారు. సభ్యులందరూ సవరించిన బడ్జెట్‌ను సుదీర్ఘంగా చర్చించి ఆమోదించినట్లు వెల్లడించారు. బడ్జెట్ అంచనా ప్రారంభపు నిల్వ రూ.664.33 కోట్లు. అన్ని పద్దుల కింద జమలు రూ.4949.89 కోట్లు. ప్రారంభపు నిల్వతో కలిపి మొత్తంగా జమలు రూ.5614.22 కోట్లని మేయర్ వివరించారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ రవికృష్ణంరాజు, పట్టణ ప్రణాళిక అధికారి సురేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, డీసీ(రెవెన్యూ) ఫణిరామ్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ దామోదరరావు, యూసీడీ పీడీ పాపునాయుడు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, కార్యదర్శి నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు.

జనవరి నుంచి పింఛన్ రూ.3 వేలు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన మంత్రులు బొత్స సత్యనారాయణ, అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి, అదీప్‌రాజ్, నాగిరెడ్డి, కలెక్టర్ మల్లికార్జున, సమన్వయకర్తలు కె.కె.రాజు, ఆనంద్‌కుమార్

- పండగల ప్రతీ పథకం అమలు
- జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు సీఎం జగన్ నిర్దేశం

మహారాణిపేట: వైఎస్సార్ పింఛన్ కానుక పెంపు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత కార్యక్రమాల నిర్వహణపై ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, అధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జనవరి నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక రూ.3 వేలకు పెంచుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీని పూర్తిగా నెరవేరుస్తున్నట్లు చెప్పారు. జనవరి 19న అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ, జనవరి 23 నుంచి 31 వరకు ఆసరా, ఫిబ్రవరి 5 నుంచి 14 వరకు వైఎస్సార్ చేయూత కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. ప్రతీ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలని ఆదేశించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవల గురించి తెలియని వారు ఉండరాదని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, ఎ.అదీప్‌రాజ్, వాసుపల్లి గణేష్ కుమార్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్ కె.కె.రాజు, కలెక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఆరోగ్య శ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ సుమేధకు ఘన స్వాగతం



సింధియా: ఆఫ్రికా సహా 12 దేశాల్లో పర్యటించి తిరిగి గురువారం విశాఖపట్నం చేరుకున్న ఐఎన్ఎస్ సుమేధకు సిబ్బంది కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. సముద్ర భద్రతలో దేశ నిబద్ధతను ప్రదర్శిస్తూ ఈ నౌక 22 వేల నాటికల్ మైళ్ల దూరాన్ని ప్రయాణించింది. ఆఫ్రికా సహా 12 దేశాలతో సముద్ర భాగస్వామ్యంలో పాల్గొంది.

టీడీపీ వర్గీయుల దౌర్జన్యం

- అభివృద్ధి పనులు ఆపాలంటూ బోరవానిపాలెంలో గొడవ
- అడ్డుకున్న సీపీఎం నాయకుడిపై దాడి



సీపీఎం నాయకుడిపై దాడి చేస్తున్న టీడీపీ వర్గీయులు

మధురవాడ: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఎక్కడికక్కడ స్వాగతిస్తుంటే.. టీడీపీ వర్గీయులు ఓర్వలేకపోతున్నారు. అభివృద్ధి కార్యక్రమాల సభల్లో గలాటా సృష్టించడానికి కుట్రలు పన్నుతున్నారు. ఇది సరికాదన్న మధురవాడ ఏరియా సీపీఎం నాయకుడు, అడ్వకేట్ బోర అప్పలరెడ్డిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన 5వ వార్డు బోరవానిపాలెంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా.. మధురవాడ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న బోరవానిపాలెంలో పార్కు అభివృద్ధి, శివాలయం దగ్గర ఓపెన్ జిమ్ ఏర్పాటు పనుల నిమిత్తం శంకుస్థాపనకు జీవీఎంసీ అధికారులు గురువారం సాయంత్రం అన్ని ఏర్పాట్లు చేశారు. వీటితోపాటు ఇక్కడ మారికవలస తుపాను భవనానికి మరమ్మతులు, కొత్తపాలెం అయోధ్యనగర్, సాయిరాం కాలనీల్లో సీసీ రోడ్లు, కాలువలు తదితర రూ.69.65 లక్షలతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేయాల్సి ఉంది. అక్కడ ఏర్పాటు చేసిన సభలోకి టీడీపీ నాయకురాలు బోయి రమాదేవి ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు వచ్చి అభివృద్ధి పనులకు వ్యతిరేకంగా సంతకాలు సేకరించడంతోపాటు వాటిని ఆపాలంటూ వాదనకు దిగారు. అభివృద్ధి పనులు ఆపమనడం సరికాదంటూ అక్కడే ఉన్న సీపీఎం నాయకుడు బోర అప్పలరెడ్డి ప్రశ్నించారు. దీంతో టీడీపీ వర్గీయులంతా ఒక్కసారిగా ఆయనపై దాడికి తెగబడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కలగజేసుకొని దాడిని నిలువరించారు. సంఘటన స్థలికి పీఎం పాలెం సీఐ రామకృష్ణ, ఎస్ఐ సునీత తమ సిబ్బందితో చేరుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఈ ఘటన కాస్త సద్దుమణిగే క్రమంలో అక్కడకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేరుకున్నారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదని చెబుతుండగా.. మళ్లీ అభ్యంతరం తెలపడానికి టీడీపీ నాయకురాలు ప్రయత్నించారు. ఇబ్బంది ఉంటే రాత పూర్వకంగా ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ క్రమంలో జీవీఎంసీ 5వ వార్డు టీడీపీ కార్పొరేటర్ మొల్లి హేమలత, ఆమె భర్త నమ్మి రమణ, ఇతర నాయకులతో కలసి అక్కడికి వచ్చారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి వారితోపాటు మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు బోర శ్రీను, జెడ్సీ కనకమహాలక్ష్మి తదితరులతో కలసి అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకం ఆవిష్కరించారు. దీంతో టీడీపీ వర్గీయులు ఖంగుతిన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రాణం ఉన్నంత వరకూ జగన్ వెంటే ఉంటా..

- పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవం
- తనపై దుష్ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



సాక్షి, విశాఖపట్నం: తాను పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలన్నీ అవాస్తవమని, నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెంటే నడుస్తానని డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు స్పష్టం చేశారు. జనసేనలో తాను చేరుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ సీపీలో పంచకర్ల రమేష్‌బాబు ఉన్నప్పుడు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఫొటోను వైరల్ చేస్తూ.. టీడీపీ, జనసేన నేతలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాయతీగా, పారదర్శకంగా ప్రజల మనసులు గెలిచి రాజకీయాలు చేయాలే తప్పితే.. ఇలా తప్పుడు ప్రచారాలకు పాల్పడి రాజకీయాలు చేయడం తగదని వారిని గట్టిగా హెచ్చరించారు. మత్స్యకారుల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే తామంతా ఉంటామన్నారు. తనపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం కృషి చేస్తానని 'సాక్షి'తో చెప్పారు.

ప్రజలే మా బలం

- గెలుపు కోసమే మార్పులు చేర్పులు
- వంశీకృష్ణ రాజీనామా ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి


మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

గోపాలపట్నం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారని, చేసిన అభివృద్ధి, సంక్షేమమే తిరిగి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తుందని ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. విజయవాడ నుంచి గురువారం విశాఖ వచ్చిన ఆయనకు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలే మా బలమన్నారు. పార్టీ టార్గెట్ 175/175 అని, అందులో భాగంగానే అభ్యర్థుల మార్పులుంటాయన్నారు. బీసీలకు పెద్దపీట వేసిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని, వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి సముచిత స్థానం కల్పించినా.. రాజీనామా చేశారంటే అది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. గెలుపు అవకాశాలను బట్టి ఎక్కడైతే బాగాలేదో అక్కడ మాత్రమే మార్పులు చేపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో మార్పులు చేర్పులు జరుగుతాయన్నారు. గెలుపే ప్రాధానంగా సాగుతున్న ప్రక్రియలో అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. పార్టీ నియమాలకు కట్టుబడి, సీఎం జగన్‌పై ఉన్న అభిమానంతో సమష్టిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. రీజినల్ స్థాయిలో అభ్యర్థులు మార్చిన చోట అందర్నీ సమన్వయ పరిచే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జనవరి నెలాఖరులోగా బస్సుయాత్రలు ముగించాలని సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారన్నారు. శుక్రవారం అరుకులో బస్సుయాత్ర నిర్వహించనున్నామని, శనివారం నర్సీపట్నం నియోజకవర్గంలో యాత్ర జరుగుతుందని తెలిపారు. వచ్చే నెలలో 7 నియోజకవర్గాల్లో బస్సు యాత్రలు నిర్వహించనున్నామని, దీంతో యాత్రలు ముగుస్తాయన్నారు. విశాఖ నుంచి పరిపాలన చేయాలని గతంలో అనుకున్నా కోర్టుల వల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయని, కోర్టు సూచనల మేరకు జనవరిలో ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. వైవీ సుబ్బారెడ్డికి పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, పార్టీ నేత చింతలపూడి వెంకటరామయ్య, బీఎస్ కృష్ణ, పలువురు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.

విద్యార్థి ఆత్మహత్య


నిఖిల్ (ఫైల్)

కూర్మన్నపాలెం: విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిసిన వివరాల ప్రకారం.. అగనంపూడి పరిధి దిబ్బపాలెం ప్రాంతానికి చెందిన మొల్లి నిఖిల్(17) గాజువాకలోని న్యూ ఐటీఐ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులతోపాటు అతడు భవానీ దీక్షలో ఉన్నాడు. బుధవారం రాత్రి అతడి తల్లిదండ్రులు మాత్రమే నగరంలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి గుడికి వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుడికి వెళ్లి అర్ధరాత్రి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు నిఖిల్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించడంతో వెంటనే కిందకు దించి అగనంపూడి ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే నిఖిల్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి మొల్లి రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. నిఖిల్‌కు అన్నయ్య ఉన్నాడు. అతడు ప్రస్తుతం ఆర్మీలో పనిచేస్తున్నాడు. నిఖిల్ తండ్రి క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నిఖిల్ ప్రేమలో విఫలమవడంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు.

మార్గశిర శోభ

- కనకమహాలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తులు
- ఘనంగా మూడో గురువారం పూజలు


ఆలయ మండపం వద్ద క్యూల్లో కిటకిటలాడిన భక్తులు

డాబాగార్డెన్స్: శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మార్గశిర మాసం మూడో గురువారం అమ్మవారి దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. బుధవారం అర్ధరాత్రి నుంచే అమ్మవారి దర్శనానికి బారులుదీరారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చనలు జరిపారు. స్వర్ణాభరణాలతో అమ్మవారు దేదీప్యమానంగా వెలుగొందారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేద మంత్రాలు, నాదస్వరాలతో ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణలు, వేద పారాయణాలు, శ్రీచక్రార్చన లక్ష్మీ హోమం తదనంతరం అమ్మవారికి విశేష పూజ నిర్వహించారు. పరిసర ప్రాంతాల ప్రజలు తీసుకొచ్చిన పసుపు కుంకుమ నీళ్లతో జలాభిషేకం జరిపారు. పెద్ద ఎత్తున క్షీరాభిషేకం నిర్వహించి పసుపు పూశారు. ప్రత్యేక పూజలు జరిపిన తర్వాత అమ్మవారికి స్వర్ణాభరణ అలంకరణ చేశారు. అర్ధరాత్రి 12.05 నుంచి 1.30 గంటల వరకు ఈ అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వెండి కవచాలు తొడిగారు. మధ్యాహ్నం 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి మహానివేదన(రాజభోగం), 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్వదర్శనం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు పంచామృతాభిషేక సేవ, సహస్రనామార్చన, స్వర్ణాభరణ అలంకరణ, రాత్రి 7 నుంచి సర్వదర్శనం కల్పించారు. ఆలయ ఈవో కె.శిరీష, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వన్‌టౌన్ పోలీసులు ఏర్పాట్లను పరిశీలించారు.


క్యూల్లో బారులుదీరిన భక్తులు


టౌన్‌కొత్తరోడ్డు వరకు భక్తజనసందోహం


చిన్నారిని అమ్మవారికి చూపుతున్న భక్తులు

ప్రత్యేక ఏర్పాట్లు..

భక్తులకు దేవస్థానం అధికారులు మంచినీటి సౌకర్యం కల్పించారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేలాది మంది భక్తులకు భోజన ఏర్పాట్లు చేశారు. రీడింగ్ రూమ్ వద్ద ధర్మ దర్శనంతో పాటు రూ.100, రూ.200 టికెట్లు తీసుకున్న భక్తులకు క్యూల్లో పంపించారు. సీతారామస్వామి ఆలయం వైపు వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, వికలాంగులు, రూ.500 టికెట్ తీసుకున్న వారికి దర్శనం కల్పించారు. అమ్మవారి ఆలయ వెనుకభాగం, ఆలయ ప్రధాన ద్వారం, దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు విక్రయించారు. పలు స్వచ్ఛంద సంస్థలు ఉచిత ప్రసాదం అందజేశాయి. టూ వే కావడంతో వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయి.. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. భక్తుల సౌకర్యార్థం సింహాచలం, మధురవాడ నుంచి ఉచిత బస్సు సర్వీసులు నడిపినట్లు ఆలయ ఈవో తెలిపారు.

దోమల లిక్విడ్ తాగి చిన్నారి మృతి

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ సమీప నేతాజీ నగర్‌లో నివాసముంటున్న పోసమూరి వీర వెంకట రాజు తన నాలుగేళ్ల కుమార్తె ఆడుకుంటూ దోమల నివారణ లిక్విడ్ తాగడంతో మృతి చెందింది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గాజువాకలో కాకతీయ స్కూల్లో డ్రైవర్‌గా పని చేస్తున్న వీర వెంకట రాజు, భార్య నిఖిత, కుమార్తె నిత్యశ్రీ అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. బుధవారం మధ్యాహ్నం నిత్యశ్రీ ఆడుకుంటూ అందుబాటులో దోమల నివారణకు వాడే లిక్విడ్ నీడిల్ నోట్లో పెట్టుకుని తాగేసింది. ఆడుకుని నిద్రపోయిందని భావించిన తల్లి..సాయంత్రం వరకూ పాప లేవకపోవడంతో అనుమానం వచ్చి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. అక్కడి నుంచి పాత గోపాలపట్నంలో ఉన్న చిన్నారి అమ్మమ్మ ఇంటికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు గోపాలపట్నం పోలీసులు సమాచారాన్ని సేకరించారు. చిన్నారి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఘటన ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో పరిధిలోది కావడంతో కేసును అక్కడ పోలీసులకు అప్పగించారు. నిత్యశ్రీకి వినికిడి సమస్య ఉందని రోజు స్పీచ్ థెరపీకి తీసుకువెళుతుంటామని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే దురదృష్టవశాత్తు బుధవారం స్పీచ్ థెరపీకి వెళ్లకపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

మనస్తాపంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


ఎన్టీపీసీ ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రసాద్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో రైలుపట్టాల కిందపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దువ్వాడ జీఆర్‌పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం విశాఖ ఉక్కు ఉద్యోగి ఎంవీఎస్ ప్రసాద్ తన కుమారుడు నెక్కంటి నవీన్ కృష్ణ, భార్య అరవిందతో కలిసి దువ్వాడ సమీపంలోని సాయిరామ్‌నగర్‌లో నివాసముంటున్నారు. నవీన్ కృష్ణ కొద్దికాలం పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశాడు. నెల రోజుల క్రితం ఆ కంపెనీ కొంతమంది ఉద్యోగులను ఆపేసింది. వీరిలో నవీన్ కృష్ణ కూడా ఉండడంతో తీవ్ర మనస్తాపానికి గురై గురువారం ఉదయం దువ్వాడ రైల్వేస్టేషన్ ప్రధాన భవనానికి వెనుకవైపు నున్న ఎన్టీపీసీ రైల్వేట్రాక్‌పై బలవన్మరణానికి పాల్పడ్డాడు. జీఆర్‌పీ సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

చిన్నారి పెళ్లికూతురు సందడి


లొకేషన్‌లో నటి అవికా గోర్

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డులో గుడ్లవానిపాలెం బీచ్ వద్ద గురువారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. చిన్నారి పెళ్లికూతురుతో గుర్తింపు పొందిన అవికా గోర్ నటిస్తున్న ఓ సినిమాకు సంబంధించిన సన్నివేశాలను ఇక్కడ బీచ్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. షూటింగ్ చూసేందుకు పెద్ద ఎత్తున పర్యాటకులు, స్థానికులు గుమిగూడారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.64,250
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.58,900
వెండి(కిలో):	రూ.81,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం	: రూ.100
బ్రాయిలర్ (లైవ్)	: రూ.120
స్కిన్	: రూ.210
స్కిన్‌లెస్	: రూ.220

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	625.00
విజయనగరం	629.00
శ్రీకాకుళం	629.00

స్కూల్ ఆటోలు, బస్సులపై దృష్టి


మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

గోపాలపట్నం: స్కూల్, కళాశాలల బస్సులు, ఆటోలపై ప్రభుత్వ యంత్రాంగం పూర్తి దృష్టి సారించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. మాధవధార రవాణా శాఖ కార్యాలయంలో ఉప రవాణా కమిషనర్ రాజారత్నం నేతృత్వంలో విద్యాశాఖ, శిశు సంక్షేమ శాఖ, ట్రాఫిక్ పోలీస్ శాఖ అధికారులతో గురువారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాంతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల బస్సులు, ఆటోలు ఎన్ని వినియోగిస్తున్నారో వివరాలు తెలుసుకున్నారు. వాటి నిర్వహణ. భద్రత ప్రమాణాలు, సామర్థ్యానికి మించి విద్యార్థులను తీసుకువెళుతున్నారా? అలాంటి బస్సులు, ఆటోలపై ఎటువంటి చర్యలు తీసుకున్నారన్న వివరాలు తెలుసుకున్నారు. స్కూల్ బస్సులు, ఆటోల్లో 1098 చైల్డ్‌లైన్, పోలీస్ టోల్ ఫ్రీ నంబర్లు ప్రదర్శిస్తున్నారా లేదా అని అధికారులను ప్రశ్నించారు. విద్యార్థులు సురక్షిత ప్రయాణం, వారి హక్కుల పరిరక్షణకు విఘాతం కలకుండా ఉండేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎవరికైనా ఇబ్బంది కలిగిస్తే apscpcr2018@gmail.comకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ సమీక్షలో ఆర్టీవో ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యురాలు ఎం.రజని, కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారి డి.దివాకర్, జిల్లా బాలల సంరక్షణ విభాగం పీవోఎస్ఐసీ మమత, రవాణా శాఖ అధికారులు ఐ.మాధవి, ఎస్.శిరీషా దేవి, ఎం.బుచ్చిరాజు పాల్గొన్నారు.

అరకు అందాలు చూసొస్తూ...

- రోడ్డు ప్రమాదంలో మింది యువకుడు దుర్మరణం
- మరో యువకుడికి తీవ్ర గాయాలు


తాడాన తేజ (ఫైల్)



వ్యాన్‌ను ఢీకొట్టిన బైక్

కొత్తవలస/అక్కిరెడ్డిపాలెం: అరకు అందాలను తిలకించి తిరుగుప్రయాణమైన ఇద్దరు స్నేహితులు గురువారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వీరిలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గాజువాక సమీపంలోని మింది గ్రామానికి చెందిన యువకులు తేజ, భానులు ద్విచక్రవాహనంపై అరకు విహారయాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో విజయనగరం జిల్లా కొత్తవలస మండలం నిమ్మలపాలెం కూడలి మలుపు వద్ద ముందువెళ్తున్న వాహనాన్ని ఓవర్ ట్రాక్‌చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టారు. దీంతో తేజ(23) అక్కడికక్కడే మృతి చెందగా, భాను గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వైద్యంకోసం 108 వాహనంలో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాలపాలైన భాను కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. మృతుడు తేజ తల్లిదండ్రులు అక్కిరెడ్డిపాలెంలో కూరగాయల వ్యాపారం చేస్తుంటారని మింది గ్రామస్తులు తెలిపారు.

నేడు కళాభారతిలో శాస్త్రీయ నృత్యోత్సవం

మద్దిలపాలెం: విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం శాస్త్రీయ నృత్యోత్సవం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు కన్నం వెంకటరమణరావు తెలిపారు. అంతర్జాతీయ కూచిపూడి నృత్య కళాకారుడు గురు వెంపటి రవిశంకర్‌ను జీవన సాఫల్య పురస్కారంతో ఘనంగా సత్కరిస్తున్నట్లు చెప్పారు. అలాగే కూచిపూడి కళాకారులతో నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశామని.. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మరో ముగ్గురికి కరోనా



మహారాణిపేట: జిల్లాలో మరో ముగ్గురికి కరోనా సోకింది. వీరి నుంచి సేకరించిన నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. గడిచిన 24 గంటల్లో 170 మందికి పరీక్షలు చేయగా.. వీరిలో ముగ్గురికి కరోనా నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఎనిమిది మంది హోమ్ ఐసోలేషన్‌లో, ఇద్దరు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ముగ్గురు డిశ్చార్జ్ అయినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'



ఏయూక్యాంపస్: జిల్లాలో ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తూ.. వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ఈ పోటీలకు మంచి స్పందన వస్తోంది. యువత ఉత్సాహంగా నమోదు చేసుకున్న ఆటల్లో పాల్గొంటూ.. తమ ప్రతిభను నిరూపిస్తున్నారు. సచివాలయ సిబ్బంది సమన్వయం చేస్తూ పోటీలను విజయవంతం చేస్తున్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో క్రికెట్, ఖోఖో, కబడ్డీ పోటీలు జరిగాయి. ఏయూ జిమ్నాజియంలోని ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.


కబడ్డీ.. కబడ్డీ..


క్రికెట్ పోటీలు


పట్టుకో.. పట్టుకో..


బ్యాడ్మింటన్